క్లుప్తంగా

డ్రగ్స్ జోలికి వెళితే భవిష్యత్తు చీకటే



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

కొవ్వూరు: మాదక ద్రవ్యాలకు (డ్రగ్స్) అలవాటు పడితే భవిష్యత్తు అంధకారం అవుతుందని, యువత మత్తు పదార్థాల జోలికి పోయి భవిష్యత్తును పాడు చేసుకోవద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) ఇన్‌స్పెక్టర్ పి. శ్రీనివాసరావు సూచించారు. డ్రగ్స్ వాడకం వలన కలిగే అనర్థాలపై పట్టణంలోని సంస్కృత కళాశాలలోని విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి పౌరుడూ సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. డ్రగ్స్ వాడకం ద్వారా కలిగే శారీరక, మానసిక, సామాజిక అనర్థాలను ఆయన విద్యార్థులకు వివరించారు. ఎక్కడైనా డ్రగ్స్ విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే ఎస్ఈబీ అధికారులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ డి.గౌరీశంకరరావు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంక్ లావాదేవీలపై అవగాహన అవసరం

నల్లజర్ల: బ్యాంకు లావాదేవీలు, డిపాజిట్లపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దూబచర్ల శాఖ మేనేజర్ ఆర్.ఏడుకొండలు అన్నారు. బ్యాంకింగ్ లావాదేవీలు, డిపాజిట్లపై మంగళవారం దూబచర్ల గ్రామ సచివాలయం వద్ద ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్‌మేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏడుకొండలు మాట్లాడారు. బ్యాంకులు అందించే రోజువారీ సేవలతో పాటు డిపాజిట్లు, బ్యాంకింగ్ లావాదేవీలు, పొదుపు ఆవశ్యకత, రుణాలు, సెక్యూరిటీ స్కీమ్స్, వృద్ధులకు బ్యాంకు కల్పించే సౌకర్యాలు, సోషల్ సెక్యూరిటీ స్కీమ్స్, సైబర్ క్రైమ్స్ గురించి వివరించారు. కార్యక్రమంలో బ్యాంక్ క్రెడిట్ మేనేజరు జగన్మోహన సాయి, ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.ఆంజనేయులు, మేనేజరు అశోక్‌కుమార్, రీసోర్సు పర్సన్‌లు ఎన్.అనిల్, ఎన్.సుబ్బరామయ్య, కె.చందు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం–సత్యవాడ 11 కేవీ విద్యుత్తు ఫీడర్‌లో ఆర్‌డీఎస్ఎస్ పనులు జరుగుతున్నందున బుధవారం నుంచి శనివారం వరకూ నాలుగు రోజుల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో నిడదవోలు ఈఈ బి.వీరభద్రరావు మంగళవారం తెలిపారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ మండలంలోని సత్యవాడ గ్రామంతో పాటు ఉండ్రాజవరం రైతులకు విద్యుత్తు సరాఫరా నిలిపివేస్తామని చెప్పారు. వ్యవసాయ విద్యుత్ సరాఫరా ఉదయం 5 నుంచి 6 గంటల వరకూ, మధ్యాహ్నం 12 గంటలకు ఇచ్చేలా మార్పు చేసినట్టు వివరించారు.

ముమ్మరంగా ఖరీఫ్ దమ్ములు



కానూరులో కృషి ట్రాక్టర్‌తో మురుగు దమ్ము

పెరవలి: ఖరీఫ్ సాగు కోసం ముందుగా వేసిన ఆకుమడులు సిద్ధమయ్యాయి. మరోపక్క కాలువల ద్వారా గోదావరి జలాలు కూడా అందుబాటులోకి వచ్చాయి. దాంతో మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు ముమ్మరంగా మురగడ దమ్ములు చేస్తున్నారు. నిడదవోలు నియోజకవర్గంలో ఈ సీజన్‌లో 36 వేల ఎకరాల్లో వరిసాగు జరుగుతుంది. పెరవలి మండలంలో 8,500 ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. ముందస్తుగా బోర్లపై తీపర్రు, ఉసులుమర్రు, కానూరు, నడిపల్లి, కానూరు అగ్రహారం గ్రామాల్లో ఆకుమడులు వేశారు. ఈ గ్రామాల్లో నాట్లు వేయటానికి ముందుగా మురుగు దమ్ములు ముమ్మరంగా చేపట్టారు.

సైన్స్ పరిశోధనపై గెస్ట్ లెక్చర్

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో సైన్స్ పరిశోధనపై మంగళవారం గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. మెటీరియల్ సైన్స్ పరిశోధన, ఇటీవల పోకడలు, ప్రాముఖ్యత, అవసరాలు అనే అంశంపై హైదరాబాద్‌కు చెందిన చైతన్య భారతి ఇనిస్టూట్ ఆఫ్ టెక్నాలజీ ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ షణ్ముఖ సమతం గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. జీవితంలో సైన్స్ ప్రాముఖ్యతను యూజీ, పీజీ విద్యార్థులకు వివరించారు. నానో టెక్నాలజీ, స్మార్ట్, బయో మెటీరియల్స్, కంప్యూటేషన్, ఎనర్జీ మెటీరియల్స్, స్పింట్రోనిక్స్, స్పైరిమియన్‌ల ఫలితాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ కోమలిలక్ష్మి, డాక్టర్ ఈసూబ్‌బాషా, డాక్టర్ బి.గౌరీనాయుడు, కె.వెంకటేశ్వరరావు, ఫిజిక్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.

అక్కడ 604.. ఇక్కడ 190 మంది

- లక్ష్యానికి ఆమడ దూరంలో ప్రభుత్వ పాఠశాలల అడ్మిషన్లు
- విద్యార్థులను ఎగరేసుకుపోతున్న ప్రైవేట్ స్కూళ్ల యాజమన్యాలు
- నామమాత్రంగానే 'నేను బడికి పోతా'


నిడదవోలు రూరల్: గతేడాదితో పోలిస్తే ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు భారీగా పడిపోయాయి. 2024–25 సంవత్సరంలో పాఠశాలలు తెరిచి ఇప్పటికే 13 రోజులు గడిచాయి. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో ప్రవేశాలు నమోదు కాకపోవడంతో ఉపాధ్యాయులు తర్జనభర్జన పడుతున్నారు. మరోపక్క ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాల జోరు కొనసాగుతోంది. గత పదేళ్లుగా ఈ తేదీ (జూన్–25) నాటికి ఇంత తక్కువ అడ్మిషన్లయిన సందర్భం లేదని పాఠశాలల విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల అడ్మిషన్లలో గతేడాది లక్ష్యాన్ని చేరుకోవడం ఈ ఏడాది కష్టమే అంటున్నారు. నిడదవోలు పట్టణం, మండలంలో 56 ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటి వరకూ 190 మంది విద్యార్థులు ఒకటో తరగతిలో చేరేందుకు అడ్మిషన్లు తీసుకోగా, 27 ప్రైవేట్ పాఠశాలల్లో 604 మంది విద్యార్థులు ఈ ఏడాది చేరారు. 2023–24 విద్యా సంవత్సరంలో 330 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పొందడంతో ఈ ఏడాది లక్ష్యానికి మించి అడ్మిషన్లు పొందాలని విద్యాశాఖ నిర్దేశించింది. కానీ అడ్మిషన్ల ప్రక్రియ లక్ష్యానికి ఆమడ దూరంలో ఉంది.

నాడు పాఠశాలల రూపురేఖలు మారుస్తూ..

ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు పెంచేందుకు నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారు. విద్యార్థులకు అమ్మఒడి పథకంతో పాటు నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలల రూపురేఖలు మార్చారు. ప్రస్తుత ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత బడికి పోతా అనే కార్యక్రమం చేపట్టింది. పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలనేది దీని లక్ష్యం. కానీ ఆశించిన ఫలితాలు కాన రావడం లేదు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు వేసవిలోనే ముందస్తు అడ్మిషన్లు చేపట్టాయి. కూటమి ప్రభుత్వంలో ఎంతమంది చదువుకుంటే అందరికీ తల్లికి వందనం పథకం కింద డబ్బులు వస్తాయని ప్రైవేట్ యాజమాన్యాలు విస్తృతంగా ప్రచారం చేశాయి. దీంతో తల్లిదండ్రులను ప్రలోభాలకు గురిచేసి విద్యార్థులను చేర్చుకున్నాయి. ఈ కారణంగా ప్రభుత్వ పాఠశాలల నుంచి చాలామంది టీసీలు తీసుకొని వెళ్లిపోతున్నారని ఉపాధ్యాయులు బాహాటంగానే చెబుతున్నారు. అయితే తల్లికి వందనం పథకం గురించి కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకూ ఊసెత్తక పోవడం విశేషం. ఈనెల 24న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో కూడా దీనిపై ఎటువంటి ప్రకటనా రాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.



సమిశ్రగూడెం ఎంపీపీ-2 ప్రభుత్వ పాఠశాలలో ఉన్న ఏడుగురు విద్యార్థులు



ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వేసి తల్లిదండ్రులకు అందజేస్తున్న స్లిప్పులు

ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్లకు సిపార్సులు

ప్రైవేట్ స్కూళ్లలో అడ్మిషన్లు కోలాహలంగా సాగుతున్నాయి. కొన్ని స్కూళ్ల ముందు అయితే 'అన్ని తరగతుల్లో సీట్లు ఫుల్' అయ్యాయనే బోర్డులు సైతం పెట్టేస్తున్నారు. కొన్ని పేరున్న ప్రైవేటు స్కూళ్లలో అయితే సీటు కోసమని రాజకీయ నాయకుల సిఫార్సులు చేస్తేనే కాని అడ్మిషన్ దొరకడం లేదు. ఫీజులు సైతం ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారు. ఫీజుల వివరాలు స్కూలు నోటీసు బోర్డులు డిస్ ప్లే చేయాల్సి ఉండగా ఎక్కడా అమలు కావడం లేదు. ఫీజుల ధరలు సైతం చిన్న స్లిప్పులపై రాసి తల్లిదండ్రులకు అందజేస్తున్నారు. ఎల్‌కేజీ విద్యార్థికే రూ.20 వేల నుంచి వసూలు చేస్తుండగా బుక్స్‌కు అదనంగా మరో రూ.2 వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది.

అడ్మిషన్ల పెంపునకు చర్యలు



ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. దీనిపై ఉన్నతాధికారుల నుంచి ఇప్పటికే పలు ఆదేశాలు వచ్చాయి. ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన జరుగుతుంది. తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం ఉంచాలి. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు ఎక్కువ వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– కేవీ గణేష్, ఎంఈఓ, నిడదవోలు

నిడదవోలు పట్టణం, మండలంలో గత ఐదేళ్లలో ఒకటి నుంచి టెన్త్ వరకూ విద్యార్థుల వివరాలు

ఏడాది	విద్యార్థుల సంఖ్య
2019–20	6970
2020–21	8122
2021–22	8469
2022–23	7062
2023–24	6584

యోగా పోటీల విజేతలకు బహుమతులు



బహుమతులు పొందిన యోగా విజేతలతో ఎంఈవో బాలామణి తదితరులు

తాళ్లపూడి: యోగా, ధ్యాన సాధనతో విద్యార్థులు మానసిక ప్రశాంతత సాధించి చదువులో ముందంజ వేయవచ్చని ఎంఈవో సీహెచ్ బాలామణి అన్నారు. వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గాయత్రీ యోగా సమితి యోగా గురువు నక్కా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో యోగా పోటీలు నిర్వహించారు. విజేతలకు మంగళవారం ఎంఈవో చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యోగా గురువు నక్కా వెంకటేశ్వరరావు, గాయత్రీ యోగాసమితి కార్యదర్శి సత్యనారాయణ, నిర్వాహకుడు జోడాల వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు సుభాషిణి, లక్ష్మణ్‌కుమార్, రామచల్లయ్య, దుర్గాభవాని, భరత్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అధికారులతో ఎమ్మెల్యే మద్దిపాటి సమీక్ష

దేవరపల్లి: మండలంలో పని చేస్తున్న వివిధ ప్రభుత్వ అధికారులతో బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సమీక్ష నిర్వహిస్తారని ఎంపీడీఓ పి. ప్రభాకరరావు తెలిపారు. మండలంలోని మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీల కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు హాజరు కావాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నిడదవోలు: తమ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు పారిశుద్ధ్య కార్మికుల వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కమిషనర్ రాంభూపాల్‌రెడ్డిని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు జువ్వల రాంబాబు విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్లుగా కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. నిడదవోలు పట్టణ జనాభా, విస్తీర్ణం పెరిగినప్పటికీ అందుకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచలేదన్నారు. దాంతో కార్మికులపై పని భారం పెరిగి పోయిందన్నారు. కార్మికులకు సరైన పనిముట్లు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కొన్ని పరికరాలు వృథాగా పడి ఉనాయని, తగినంత సిబ్బంది లేనందున అవి దుర్వినియోగం అవుతున్నాయన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు అందించడంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే ఈ సమస్యలను పరిష్కరించాలని రాంబాబు కోరారు. కార్యక్రమంలో తూరుగోపు చిరంజీవి, బొచ్చ సాయిరమణ, బౌరిశెట్టి కొండా, బంగారు రాజేష్, కాకి రాజు, ఎ. అప్పారావు, ముప్పిడి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

కేంద్ర మంత్రి దృష్టికి పొగాకు సమస్యలు

దేవరపల్లి: పొగాకు అమ్మకాల్లో తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను రైతులు కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ దృష్టికి తీసుకువెళ్లారు. రాజమహేంద్రవరం లోక్‌సభ సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరి ఆధ్వర్యంలో బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్‌కుమార్, బోర్డు సభ్యులు, రైతు సంఘాల ప్రతినిధులు సోమవారం రాత్రి ఢిల్లీలో కేంద్ర వాణిజ్య శాఖా మంత్రి పీయూష్ గోయల్‌ను కలసి తమ సమస్యలు వివరించారు. ప్రధానంగా అదనంగా పండించిన పంటకు పొగాకు బోర్డు గతంలో 5 నుంచి 10 శాతం అపరాధ రుసుం వసూలు చేస్తోందని, గతేడాది వడగళ్ల వాన కారణంగా పంట దెబ్బతినడంతో అపరాధ రుసుం వసూలు చేయలేదని రైతులు మంత్రికి వివరించారు. ఈ ఏడాది పంట ఉత్పత్తి పెరిగినందున బోర్డు అనుమతించిన పరిమితి కంటే అదనంగా పండిని పంటను అపరాధ రుసుం లేకుండా కొనుగోలు చేయాలని మంత్రిని కోరారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం అందజేసినట్టు దేవరపల్లి వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షుడు కరుటూరి శ్రీనివాస్ తెలిపారు. రైతులకు మేలు జరిగేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పియూష్ గోయల్ హామీ ఇచ్చినట్టు ఆయన తెలిపారు. జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షుడు పరిమి రాంబాబు, కొయ్యలగూడెం వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షుడు కాకర్ల నందియ్య, మంత్రిని కలిసిన వారిలో ఉన్నారని ఆయన చెప్పారు.



కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు వినతిపత్రం అందిస్తున్న పొగాకు రైతులు

డయేరియాతో డేంజర్.. బీ కేర్‌ఫుల్



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సంధ్య

నిడదవోలు: వర్షాలు మొదలైనందున డయేరియా వ్యాధి బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు వహించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సంధ్య అన్నారు. జిల్లాలోని కొన్నిచోట్ల అతిసార కేసులను గుర్తించిన నేపథ్యంలో మున్సిపల్, ఆరోగ్యశాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. దీనిలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏఎన్ఎంలు, మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి డయేరియా నివారణ, పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సంధ్య మాట్లాడుతూ వార్డుల్లోని మురుగు నీటి కాలువలు, వీధులను శుభ్రం చేయించి, ఫినాయిల్ చల్లించాలన్నారు. కుళ్లిన, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తినరాదని సూచించారు. అలాగే కాచి వడపోసిన నీటినే తాగాలని, ఇంటివద్ద నీటి నిల్వలు లేకుండా చూడాలని సలహా ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ మురుగు కాలువలను ఎప్పటికపుడు శుభ్ర పరచాలని, తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయించాలన్నారు. ప్రతి ఒక్కరూ డయేరియాపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో నెహ్రూనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి ఈ. తేజశ్రీ , పట్టణ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ఉదయ్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ జి. ప్రసాద్. ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఇంజినీరింగ్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రమ్యంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు



ఉండ్రాజవరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

ఉండ్రాజవరం: స్థానిక భూ సమేత వేంకటేశ్వర స్వామి వారి ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలను నాల్గో రోజైన మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుడు ఖండవల్లి సూర్యనారాయణాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం విశేష హోమాలు, మహా సుదర్శన అభిషేకం, మహా సుదర్శన హోమం నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన శంఖు చక్రనామార్చన, సహస్ర దీపాలంకరణ, ఊంజల్ సేవలను అధిక సంఖ్యలో భక్తులు వీక్షించి, స్వామి వారిని దర్శించుకున్నారు.

28న ఆర్టీసీ రీజియన్ బహిరంగ వేలం

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక పార్సిల్ ఆఫీస్‌లో అన్ కలెక్టెడ్, అన్ ఐడెంటీపై పార్సిళ్లను ఈ నెల 28వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) మాధవ్ మంగళవారం తెలిపారు. ఈ బహిరంగ వేలం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు రాజమహేంద్రవరం బస్టాండ్‌లోని పార్సిల్ ఆఫీస్ వద్ద నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న ప్రజలు పాల్గొనవచ్చన్నారు.

ఆదర్శ ఆరోగ్య మండలంగా ఉంచుతాం

అతిసార వ్యతిరేక సమన్వయ కమిటీ ప్రతిజ్ఞ

నల్లజర్ల: అతిసార వ్యాధి రహిత ఆదర్శ ఆరోగ్య మండలంగా నల్లజర్లను నిలుపుదామని అతిసార వ్యతిరేక సమన్వయ కమిటీ ప్రతిజ్ఞ చేసింది. ఆ కమిటీ మండల సమావేశాన్ని మంగళవారం ఎంపీడీఓ పీఎస్ నరేష్ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. వైద్య,ఆరోగ్య శాఖతో పాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. అతిసార వ్యాధి నివారణకు తామంతా ఐక్యంగా కృషి చేస్తామంటూ తొలుత వారంతా ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ పీఎస్ నరేష్ మాట్లాడుతూ ఐదేళ్ల లోపు చిన్నారులే ఎక్కువగా అతిసార వ్యాధిన బారిన పడుతున్నారన్నారు. మండలంలో ఏఒక్క చిన్నారీ ఈ వ్యాధి బారిన పడకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇందుకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అతిసార వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టర్ గంగాధరరావు వివరించారు. పిల్లలకు విరేచనాలు అయినపుడు లీటరు నీటిలో ఓఆర్ఎస్ ప్యాకెట్ కలిపి ఆ ద్రావణాన్ని తాగించాలన్నారు. జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు ఉధృత అతిసార మాసంగా పరిగణించ బడుతుందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సింహాద్రి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అజయ్‌బాబు, ఐసీడీఎస్ సీడీపీఓ బాలాత్రిపుర సుందరి, సీహెచ్ఓ పలివెల ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు, వైద్య,ఉద్యోగులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అతిసార వ్యతిరేక సమన్వయ కమిటీ

దశల వారీగా సమస్యల పరిష్కారం

- కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- కొవ్వూరు, తాళ్లపూడిలలో అధికారులతో పరిచయ భేటీలు

కొవ్వూరు: నియోజకవర్గ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారానికి కృషి చేస్తానని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులతో మంగళవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. వివిధ శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులను, పురోగతిలో ఉన్న పనుల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అధికారులను పరిచయం చేసుకున్నారు. పార్టీలకు అతీతంగా స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని వెంకటేశ్వరరావు ప్రకటించారు. రైతులు తన దృష్టికి తీసుకు వచ్చిన విద్యుత్తు సరఫరా సమస్యలను పరిష్కరిస్తానన్నారు. రబీ ధాన్యం సొమ్ములు రైతులకు ఇంకా అందాల్సి ఉందన్నారు. పట్టణంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించామని, అసంపూర్తి నిర్మాణాలను పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. కొన్ని చోట్ల పంట కాలువల పూడిక తీయాల్సి ఉందన్నారు. గోదావరి నీటిని శుద్ధి చేసి సరఫరా చేసేందుకు కొవ్వూరులోను, ఐ.పంగిడిలోను గతంలో చేపట్టిన తాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, ఎంపీపీ కాకర్ల నారాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు బొంత వెంకటలక్ష్మి, వైఎస్ ఎంపీపీ వీరమళ్ల నారాయుడు, ఎంపీడీవో కె.సుశీల, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, మునిసిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

అభివృద్ధికి అడ్డు చెప్పవద్దు

తాళ్లపూడి: గ్రామాల్లో అభివృద్ధి ముఖ్యమని తనతో పాటు కూటమి పార్టీల నాయకులెవరూ అడ్డు చెప్పడానికి వీల్లేదని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. గ్రామాల్లో అభివృద్ధి పైనే అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. మండలంలోని అధికారుల, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులతో ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, ఎంపీడీవో వెంకటరమణలు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి అధికారులను పరిచయం చేశారు. సమావేశంలో ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండల పరిషత్‌కు ఆదాయం లేనందున వాటి పరిస్థితి పంచాయతీల కంటే దారుణంగా తయారైందన్నారు. ఇసుక సీనరేజి మండల పరిషత్‌కు వచ్చేలా చర్యలు తీసుకుంటానన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ కోదాటి కనకయ్య, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, మండల అధికారులు షేక్ సూర్జాన్, సీహెచ్ వెంకట్రావు, సీహెచ్ నెహ్రూజీ , కేఎస్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నిరంకుశ పాలనకు నిదర్శనం ఎమర్జెన్సీ

రాజమహేంద్రవరం సిటీ: కాంగ్రెస్ నిరంకుశ పాలనకు నిదర్శనంగా ఎమర్జెన్సీ నిలుస్తుందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు ధ్వజమెత్తారు. మంగళవారం ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవాన్ని స్థానిక జేఎన్ రోడ్ జేకే గార్డెన్స్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి తన అధికారాన్ని నిలుపుకోవడానికి ఎలాంటి రాజ్యాంగ విరుద్ధమైన పద్ధతులైనా అవలంబిస్తుందన్నారు. మాజీ ప్రధాని ఇందిర నిరంకుశత్వం 1975లో ఎమర్జెన్సీ సమయం దేశంలో ప్రతి ఒక్కరూ చూశారన్నారు. కాంగ్రెస్ దాని భాగస్వాముల కుట్రలు 1975 లోనే కాకుండా ప్రస్తుతం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. రాజ్యాంగ విధానాలపై గౌరవం లేకుండా ప్రవర్తించడం కాంగ్రెస్ పార్టీ నైజమని, కాంగ్రెస్ కుటిల రాజకీయాలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ 1971 ఎన్నికల్లో అవినీతి వ్యవహారాలు వలన ఇందిరా గాంధీ ఎన్నిక చెల్లదని అలహాబాద్ హైకోర్టు ఆమె ఎన్నిక రద్దు చేసిందన్నారు. ఆ సమయంలో అధికారం చేజారనివ్వకుండా ఉండడం కోసం ఇందిరాగాంధీ జూన్ 25 1975న రాష్ట్రపతిచే బలవంతంగా సంతకం చేయించి ఎమర్జెన్సీని విధించిన నిరంకుశత్వం కలిగిన ప్రధానిగా ఇందిర చరిత్రలో నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నైపుణ్యశిక్షణతో మహిళల ఆర్థికాభివృద్ధి

ఓఎన్‌జీసీ జీఎం గోకా చంద్రశేఖరరావు

రాజమహేంద్రవరం సిటీ: మహిళల స్వయం వృద్ధి సాధించాలంటే నైపుణ్యం ఉన్న వృత్తులు ఎంతగానో ఉపయోగపడతాయని ఓఎన్‌జీసీ జనరల్ మేనేజర్ గోకాడ చంద్రశేఖరరావు అన్నారు. మంగళవారం స్థానిక లాలాచెరువులోని స్వర్ణాంధ్ర ఉచిత కుట్టు, మగ్గం వర్క్ శిక్షణా కేంద్రంలో జరిగిన 72వ బ్యాచ్ ముగింపు ఉత్సవంలో చంద్రశేఖరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖరరావు మాట్లాడుతూ మహిళలు కష్టపడి సంపాదించిన మొత్తాలు పొదుపు చేయడం వల్లే, కుటుంబాలు ఆర్థికంగా నిలబడగలుగుతున్నాయన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో భార్యాభర్తలిద్దరూ కష్టపడి సంపాదిస్తేనే కుటుంబం గౌరవంగా బతికే వీలుందని అందరూ చేతి వృతులు నేర్చు కోవాలని కోరారు. ఇంటిలో ఉండే మగ్గం, కుట్టు పని ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఎక్కువగా ఉందన్నారు. స్వర్ణాంధ్ర నిర్వాహకులు రాంబాబు మాట్లాడుతూ గత 26 సంవత్సరాలుగా స్వర్ణాంధ్ర సేవా సంస్థ తరఫున కంప్యూటర్, కుట్టు శిక్షణ, మగ్గం వర్క్‌లో శిక్షణ ద్వారా సుమారు 18,250 మందికి ఉచిత శిక్షణ అందించినట్టు తెలిపారు. శిక్షణలో ఉచితంగా మెటీరియల్, మధ్యాహ్న భోజనంతో పాటు శిక్షణ అనంతరం ఉచితంగా సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందిమన్నారు. నూతన బ్యాచ్ శిక్షణ ప్రారంభమైందని జూలై 30 వరకు అడ్మిషన్ జరుగుతాయని రాంబాబు తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలు స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం ఫోన్ నంబర్ 9849847489 ద్వారా సంప్రదించాలని రాంబాబు కోరారు.